## క్లుప్తంగా

### కలెక్టర్ వెట్రిసెల్వికి నగర మేయర్ శుభాకాంక్షలు



కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్ నూర్జహాన్, పెదబాబు దంపతులు

ఏలూరు టౌన్ : కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెట్రి సెల్వికు ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శనివారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఏలూరు నగర అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏలూరు నగర అభివృద్ధి విషయంలోనూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశంలోనూ తన పూర్తి సహకారం ఉంటుందని మేయర్ నూర్జహాన్‌కు తెలిపారు.

### బలుసు బేబీ సేవలు అభినందనీయం



బలుసు బేబీని సత్కరిస్తున్న డాక్టర్ సతీష్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా వైద్యశాఖలో ఉత్తమ సేవలు అందించటం అభినందనీయమని డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ అన్నారు. వైద్య విధాన పరిషత్ శాఖకు సంబంధించి ఏలూరు డీసీహెచ్ఎస్ కార్యాలయంలో అసిస్టెంట్ ఫైనాన్స్ అధికారిగా పనిచేసిన బలుసు బేబీ పదవీ విరమణ చేశారు. ఏలూరులోని జిల్లా కార్యాలయంలో శనివారం ఆమెకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాల్‌సతీష్ ఆమెను ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆమెకు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

# భారీ వర్షం.. ప్రజలకు ఉపశమనం



వానలో గొడుగుల రక్షణలో వెళుతున్న ప్రజలు



ఏలూరు ఒన్‌టౌన్‌లో కురుస్తున్న వాన



గత మూడు రోజులుగా దోబూచులాడిన వాన శనివారం రాత్రి ఒక్కసారిగా విరుచుకుపడింది. ఉదయం సైతం నేల తడుపు చినుకులు తప్పించి పట్టుమని 10 నిమిషాల పాటు వాన కురవలేదు. రాత్రి ఉన్నట్టుండి గాలి, ఉరుములు, మెరుపులు లేకుండానే భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. అరగంట పాటు ఎక్కడివారు అక్కడే ఉండిపోయారు. అనంతరం వాన తగ్గుముఖం పట్టడంతో ప్రజలు తమ గమ్యస్థానాలకు బయలుదేరారు. భారీగా కురిసిన వానకు రోడ్లు జలమయమై వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

– ఏలూరు (ఆర్ఆర్‌పేట)



వాన నీటిలో చిక్కుకున్న కారు



వర్షంలోనే ఆటో ప్రయాణం

# దోమ కాటుపై అప్రమత్తత అవసరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్టేట్ వీబీడీ అసిస్టెంట్ మలేరియా అధికారి ఎం పార్వతీశం అన్నారు. స్థానిక కొత్తపేట గాంధీ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మలేరియా వ్యతిరేక మాసోత్సవ ముగింపు కార్యక్రమంలో పార్వతీశం పాల్గొని మాట్లాడారు. దోమ చిన్న కీటకమైనప్పటికీ దాని ద్వారా ప్రమాదకరమైన అంటువ్యాధులు డెంగీ, మలేరియా, చికున్ గున్యా సంక్రమిస్తాయన్నారు. విద్యార్థులు దోమకాటుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తపేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్ల డయేరియా, జిగట విరోచనాలు, కామెర్లు, టైఫాయిడ్, నులిపురుగు మొదలగు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని హెచ్చరించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ మలేరియా, డెంగీ దోమలు గృహాలు, గృహ పరిసరాల్లో నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. వారానికి ఒకసారి మంచి నీటి నిల్వ ప్రాంతాలైన తొట్టెలు, డ్రమ్ములు, ఓవర్ హెడ్ ట్యాంకులు, ఎయిర్ కూలర్స్, ఫ్రిజ్ వెనకబాక్స్, రుబ్బురోలు, ఫ్లవర్ వాజులు, పూల కుండీలు శుభ్రం చేసుకోవాలని, దోమల నిర్మూలలో విద్యార్థులు పాత్ర కీలకమని అన్నారు. పీఈటీ టీచర్లు అరుణ, ఇందిర మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం మలేరియా వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆశ కార్యకర్తలు పి.దేవి, సీహెచ్ దేవి తదితరులు పాల్గొన్నారు.



మలేరియా వ్యతిరేక అవగాహన ర్యాలీ

## ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూనియన్ (ఆంధ్రా బ్యాంక్) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువకులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ తెలిపారు. జూలై 1 నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన 10వ తరగతి, ఆ పైన విద్యార్హత గల 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 99485 65256, 95330 79471లో సంప్రదించాలని, అర్హులు ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్ కాపీలు, 3 కలర్ పాస్ పోర్టు ఫొటోలు తీసుకురావాలని పేర్కొన్నారు.

## కృష్ణా డెల్టాకు సాగునీరు విడుదల చేయాలి

ఏలూరు రూరల్ : ప్రభుత్వం కృష్ణా డెల్టాకు తక్షణం సాగునీరు విడుదల చేయాలని రైతులు శనివారం ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం సుంకర వారితోట పరిసర పంట చేలల్లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో పంట భూములు ఇటు కృష్ణ, అటు గోదావరికి శివారు ప్రాంతం కావడం వల్ల సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు పూర్తి కావస్తున్నప్పటికీ ఏలూరు రూరల్ మండల గ్రామాల సాగు భూములకు నేటికీ నీరు అందలేదని వాపోయారు. ఫలితంగా అనేక ప్రాంతాల్లో రైతులు నేటికీ నారుమడులు వేయలేదని, సాగు ఆలస్యమైతే రైతులు మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సమయం దాటి నెల రోజులు అయినప్పటికీ డెల్టాకు సాగునీరు విడుదల చేయకపోతే సాగు ఏలా చేయాలంటూ ప్రశ్నించారు. సాగునీటి విడుదలపై అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని రైతులు చిన్ని పోతురాజు, బైరెడ్డి లక్ష్మణరావు, అన్నంరెడ్డి రంగారావు, ఆకిరి నాగరాజు డిమాండ్ చేశారు. ఆందోళనలో పిట్టా రమణ, తలారి జయరాజు పాల్గొన్నారు.



పొలాల్లో ఆందోళన చేస్తున్న రైతులు

# అధిక ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజుల వసూలును నియంత్రించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద సీపీఎం శనివారం ధర్నా చేసింది. ఈ సందర్భంగా సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ ఏలూరులో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఏటా భారీగా ఫీజులు పెంచుకుంటూ పోతున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని తమ ఆదాయాలలో అధిక భాగం ఫీజులకే కడుతున్నారని, అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యా సంస్థల్లో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని, జర్నలిస్టులకు ఉచితంగా సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టానుసారం యూనిఫారం, పుస్తకాలు, మెటీరియల్ అమ్ముకుని వ్యాపారం సాగిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల స్కూల్, కాలేజీ ఫీజుల కంటే వీటి ఖర్చే అధికంగా ఉంటోందన్నారు. విద్యార్థులు, టీచర్లు 1: 20 నిష్పత్తి ఉండాలని, పట్టణాల్లో వెయ్యి చదరపు గజాల ఆటస్థలం, క్రీడా పరికరాలు, ల్యాబ్, లైబ్రరీ, విద్యార్థుల వాహనాల పార్కింగ్‌కు స్థలం, షెడ్లు, తరగతి గదుల్లో బల్లలు, ఫ్యాన్లు, మంచినీరు తదితర సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా.. చాలా స్కూళ్లలో ఈ సౌకర్యాలు అరకొరగా ఉంటున్నాయని వివరించారు. స్కూల్ బస్సుల్లో విద్యార్థులను అధికంగా ఎక్కిస్తున్నారని, కార్పొరేట్ విద్యా సంస్థలు ఒక పర్మిషన్‌తో రెండు సంస్థలను నడుపుతున్నాయని విమర్శించారు. ఫీజుల నియంత్రణకు ఒక సమగ్ర చట్టం చేయాలని, ప్రభుత్వ నిబంధనలు ప్రమాణాలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, వీవీఎస్ ప్రసాద్, ఎం ఇసాక్, జి.శారద, చింతాడ వెంకటలక్ష్మి, బి.లక్ష్మీ కుమారి, జి.ఏసుబాబు, పార్టీ సీనియర్ నాయకులు కంది విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

## సెలవుపై వెళ్లిన ఈవోపీఆర్డీ సరళకుమారి

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల ఈవోపీఆర్డీ ఎం సరళకుమారి 15 రోజుల సెలవుపై వెళ్లారని మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ వై. సుజాత తెలిపారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జిని నియమించాలని కోరుతూ ఎంపీడీఓ బి.ప్రణవి జిల్లా పంచాయతీ అధికారిని కోరారు. ఈ నెల 26 నుంచి గ్రామాల్లో చేపట్టిన స్టాప్ డైయేరియా కార్యక్రమాన్ని ఈవోపీఆర్డీ పరివేక్షిస్తున్న విషయం తెలిసిందే.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

### ఏసీ బస్సులు..

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర) | 21.00 | 10 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 21 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.30 | 43 |
| ఏలూరు – తిరుపతి(ఇంద్ర) | 16.00 | -- |
| ఏలూరు – తిరుపతి(ఇంద్ర) | 19.00 | 30 |

### సూపర్ లగ్జరీ

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 15 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ | 21,.15 | 4822 | 19 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 06 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 19 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 4800 | 17 |
| ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 15 |
| ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం | 21.00 | 4804 | 14 |
| ఏలూరు – ఈసీఐఎల్ | 22.30 | 4814 | 10 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 20.20 | 98511 | 00 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ | 21.10 | 98503 | 00 |
| ఏలూరు – తిరుపతి | 16.00 | 4830 | 32 |

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 48 | అరటి కాయ (1) | 05-07 |
| వంకాయలు (గులాబీ) | 24 | చిక్కుడు కాయలు | 90 |
| వంకాయలు (కాంతులు) | 36 | చామదుంపలు | 48 |
| వంకాయలు (తెలుపు) | 38 | ములక్కాడలు | 05, 07 |
| బెండకాయలు | 24 | కంద | 64 |
| పచ్చిమిర్చి | 40 | బీట్‌రూట్ | 36 |
| కాకర కాయలు | 44-54 | కీరా దోస | 44 |
| బీరకాయలు | 44 | ఫ్రెంచ్‌బీన్స్ | 100 |
| బీరకాయలు (పందిరి) | 60 | అల్లం | 180 |
| క్యాబేజీ | 40 | కొత్తిమీర (కట్ట) | 25 |
| క్యారెట్ | 34-56 | పాలకూర | 10 |
| దొండకాయలు | 24 | చుక్కకూర | 10 |
| బంగాళదుంపలు | 38 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 38 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 64 | పుదీనా | 05 |
| దోసకాయలు | 28 | బఠాణీ | -- |
| ఆనబకాయ (1) | 10-15 | క్యాప్సికమ్ | 84 |
| పొట్లకాయ(1) | 15-20 | చిలకదదుంప | 48 |

# జాతీయ స్థాయి పోటీలకు సీఆర్ఆర్ విద్యార్థిని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఐ.నాగసింధు వాటర్ పోలో క్రీడలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ పి.సాయి కుమారి శంకర్ తెలిపారు. నాగసింధును శనివారం సీఆర్ఆర్ విద్యా సంస్థల పరిపాలనా కార్యాలయంలో సీఆర్ఆర్ విద్యా సంస్థల పాలక మండలి కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్ వంకినేని రఘు కుమార్ ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ తమ విద్యా సంస్థల్లో చదువుతోపాటు క్రీడలపైనా విద్యార్థులు శ్రద్ధ చూపేవిధంగా వారిని ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ సాయికుమారి శంకర్ మాట్లాడుతూ తమ పాఠశాలలో 11వ తరగతి చదువుతున్న నాగసింధు ఈ నెల 23వ తేదీన విజయవాడలో జరిగిన వాటర్‌పోలో పోటీల్లో పాల్గొని రాష్ట్ర జట్టుకు ఎంపికైందని, వచ్చే నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోందని వివరించారు.



నాగసింధును సత్కరిస్తున్న విద్యా సంస్థల ప్రతినిధులు

## పింఛన్ల పంపిణీకి కసరత్తు

ఏలూరు రూరల్ : ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో జూలై 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేయనున్నామని ఎంపీడీఓ బి.ప్రణవి శనివారం తెలిపారు. మండలంలోని 15 పంచాయతీల్లో 5,374 మంది లబ్ధిదారులకు రూ.3,68,17,500 ఇళ్ల వద్దే అందిస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారుల్లో వృద్ధులు 1,999 మంది, వితంతువులు 1,414, మత్స్యకారులు 1,035, వికలాంగులు 706, ఒంటరి మహిళలు 98, అభయహస్తం 69, కల్లుగీత కార్మికులు 35, చేనేత కార్మికులు 9, చర్మకారులు 5, డప్పుదారులు 3, ట్రాన్స్‌జెండర్స్ ఒకరు ఉన్నారని వివరించారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు(మెట్రో): జిల్లా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన వెట్రిసెల్విని శనివారం ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెట్రిసెల్విని ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటిలు వేర్వేరుగా కలిశారు. మొక్క, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని వికలాంగుల సంక్షేమ సంఘం విసాస్, ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి నటరాజ్ కోరారు. పర్సంటేజ్ పేరుతో గతంలో దివ్యాంగులను తొలగించారని పేర్కొన్నారు. ప్రతి దివ్యాంగునికీ కొత్త ప్రభుత్వం రూ.3 వేలు నుంచి రూ.6 వేలకు పెంచే దివ్యాంగుల పింఛన్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులు పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని అశోక్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతల నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎంఎస్ కాలనీ, చాణక్యపురి కాలనీ, డగ్లస్ హాస్టల్ రోడ్డు, డీ మార్ట్ ప్రాంతం, బ్రహ్మంగారి గుడి రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

## కృత్రిమ అవయవాల పంపిణీ

ఏలూరు (టూటౌన్): స్థానిక దొండపాడు ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలను అందజేస్తున్నట్టు సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్ థెరఫీ, యూడీఐడీ, నిరామయ హెల్త్ కార్డులు తదితర సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దివ్యాంగులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి కృత్రిమ అవయవాన్ని అందించిన శ్రీనివాసరెడ్డి

## ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరులో ఆర్టీసీ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వన్ టౌన్ కొత్తగూడెం సెంటర్‌కు చెందిన గుండాబత్తుల జోసఫ్ (48) ఏలూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో మనస్థాపం చెందిన జోసఫ్ శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే జోసఫ్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డయేరియా కట్టడే లక్ష్యం

భీమడోలు: డయేరియా కట్టడే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పని చేస్తోందని ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి జి.చంద్రశేఖర్ అన్నారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని అర్జావారిగూడెంకు చెందిన వృద్ధురాలు చిగురుపాటి పుష్పరాజ్యం, లింగంపాడుకు చెందిన కోనా చంద్రకాంతంలు కలుషిత ఆహారం తిని డయేరియా బారిన పడి చికిత్స పొంది కోలుకున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి బాగుందని, వారిలో పుష్పరాజ్యం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కాగా చంద్రకాంతం ఆసుపత్రిలో వైద్య పొందుతోంది. ఈ నేపథ్యంలో శనివారం వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీలు సంయుక్త ఆధ్వర్యంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు భీమడోలులో పర్యటించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న చంద్రకాంతం ఆరోగ్య పరిస్థితిని గుండుగొలను వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం నిలకడగానే ఉందని, తాను ఉపాధి నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లిన తరుణంలో తిన్న ఆహారం కలుషితమైందని ఆమె చెప్పింది. ఆమెకు ఉచితంగా మందులను అందించారు. వేడి ఆహారం, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. డయేరియాను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని డాక్టర్ శ్రీలక్ష్మి చెప్పారు.